www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 డిసెంబర్ 2024

5

పశ్చిమ గోదావరి



21న జెడ్‌పి సర్వసభ్య ప్రత్యేక సమావేశం

అదే రోజు మధ్యాహ్నం సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

జెడ్‌పిటిసిల అభ్యర్థన మేరకు ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ డాక్టర్ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సమావేశానికి సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహిస్తారని తెలిపారు. సదరు సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కొల్లేరులో మరోసారి అటవీ శాఖాధికారులు హడావుడి చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంటూ పలు చేపల చెరువులకు గండ్లు కొట్టడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమైతే కొల్లేరులోని ఐదో కాంటూరు లోపల ఉన్న అన్ని అక్రమ చేపల చెరువులకు గండ్లు కొట్టాలని, అలాకాకుండా ప్రత్యేకంగా ఎంచుకున్నట్లు కొన్ని చెరువుల వద్దకే వెళ్లి గండ్లు కొట్టడం ఏమిటనే అనుమానాలు సర్వత్రా నెలకొన్నాయి. ఇదంతా రాజకీయ ప్రమేయంతోనే జరుగుతుందా అనే చర్చ సాగుతోంది. చేపల చెరువుల యజమానులను బెదిరించి దారికి తెచ్చుకుని డబ్బులు వసూలుకే నాయకులు ఇదంతా చేస్తున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది.



కొల్లేరులో హడావుడి..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాదాపు 77 వేల ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అభయారణ్యం పరిధిలో విచ్చలవిడిగా చేపల చెరువుల తవ్వకాలు సాగాయి. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో దాదాపు 43 వేల ఎకరాల్లో చేపల చెరువులను ధ్వంసం చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో పట్టా భూముల్లోని చేపల చెరువులను సైతం బాంబులు పెట్టి మరీ అధికారులు ధ్వంసం చేశారు. చేపల చెరువులకు గండ్లు కొట్టడంతో కొల్లేరు ప్రాంతంలోని దాదాపు 120 గ్రామాల ప్రజల ఉపాధి దెబ్బతింది. దీంతో కొల్లేరు కాంటూరు పరిధిని కుదించాలని అక్కడి ప్రజలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. దాని పరిస్థితిపై ఇప్పటి వరకూ ఎటువంటి పురోగతీ లేదు. రాజకీయ నాయకులు మాత్రం కొల్లేరు వ్యవహారాన్ని ఒక ఆర్థిక వనరుగా వాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ ఎంఎల్‌ఎలు కొల్లేరులో చేపల చెరువులు తవ్వించేస్తూ వాటిలో వాటాలు తీసుకుంటూ భారీగా దండుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు దీనికి పూర్తిగా సహకరిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే, మీడియాలో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే గండ్లు కొడుతున్నామని హడావుడి చేయడం, ఆపై యథారాజా తథా ప్రజా అన్నట్లు ఉంటున్న పరిస్థితి కన్పిస్తోంది. గడిచిన వైసిపి ప్రభుత్వంలోనూ, అంతకుముందు సైతం కొల్లేరులో పెద్దఎత్తున అక్రమ చెరువుల తవ్వకాలు సాగాయి. కొల్లేరును ఆనుకుని ఉన్న కైకలూరు, ఉండి, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో చేపల చెరువుల తవ్వకాలు విచ్చలవిడిగా సాగాయి.

మళ్లీ హడావుడి..★★★

ఆపరేషన్ కొల్లేరులో తర్వాత మళ్లీ దాదాపు 18 వేల ఎకరాల్లో చేపల చెరువుల అక్రమ తవ్వకాలు సాగినట్లు అంచనా వేస్తున్నారు. దీనిపై కొంతమంది సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అధికారులపై మళ్లీ ఒత్తిడి పెరగడంతో పలు చేపల చెరువులకు గండ్లు కొడుతూ అధికారులు హడావుడి చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చేపల చెరువులకు గండ్లు కొట్టడంపై ఎవరికీ ఏ అభ్యంతరం లేదు. అయితే అధికారులు గండ్లు కొడుతున్న వ్యవహారం మాత్రం పలు అనుమానాలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొల్లేరులో ఐదో కాంటూరు పరిధిలో చేపల చెరువులు సాగు చేస్తున్న యజమానులకు కొంతమంది ప్రజాప్రతినిధుల నుంచి హెచ్చరికలు వెళ్లినట్లు ప్రచారం సాగింది. 'మీరు ఏ ఇబ్బందీ లేకుండా కొల్లేరులో చేపల చెరువుల సాగు చేసుకోవాలంటే ఎకరాకు రూ.పది వేలు వరకూ ఇవ్వాలి' అని పలువురు నాయకులు డిమాండ్ చేసినట్లు అప్పట్లో పెద్దఎత్తున చర్చ సాగింది. తర్వాత ఏం జరిగిందో ఏమోగానీ విషయం సద్దుమణిగింది. ఇప్పుడు మళ్లీ చేపల చెరువులకు అధికారులు గండ్లు కొడుతుండటం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు తూచతప్పకుండా పాటించాలంటే కొల్లేరు కాంటూరు లోపల ఉన్న చేపల చెరువులన్నింటినీ ధ్వంసం చేయాలి. అలాకాకుండా కొన్ని చెరువులకే పరిమితం కావడం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఆకివీడు పరిధిలోని నిడమర్రు మండలం అడవికొలనులోని కొల్లేరు ప్రాంతంలో ఐదో కాంటూరు పరిధిలోని చెరువులకు రెండు రోజుల క్రితం అధికారులు గండ్లు కొట్టారు. ఆగడాలలంకలోనూ ఇలాంటివి జరిగినట్లు తెలుస్తోంది. కొల్లేరులో వేలాది ఎకరాల్లో అక్రమ చేపల చెరువులు ఉండగా కొన్ని చెరువులకే అధికారులు గండ్లు కొట్టడం జనం అనుమానం పడేలా చేస్తోంది. అధికార పార్టీ నాయకుల సూచనల మేరకే ఈ విధంగా కొన్ని చెరువుల వద్దకు అధికారులు వెళ్తున్నారా అనే చర్చ సాగుతోంది. చేపల చెరువుల యజమానులు బెదిరించి దారికి తెచ్చుకునేందుకు నాయకులు ఈ విధంగా చేయిస్తున్నారా అనే ప్రశ్నలు అందరినీ వేధిస్తున్నాయి. గతంలో కొల్లేరులో చేపల చెరువులకు గండ్లు కొడితే అటవీశాఖ అధికారులు ఫొటోలు తీసి మీడియాకు పంపించేవారు. ఇప్పుడు అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండాపోయింది. మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పని కానిచ్చేస్తున్నారు. దీంతో దీనివెనుక ఏదో కుట్ర ఉందనే అభిప్రాయం అందరిలోనూ కలుగుతోంది. దీనిపై అటవీశాఖ జిల్లా అధికారి విజయను వివరణ కోరగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే గండ్లు కొట్టడం జరుగుతుందని, దీనిలో వేరే ఎవరి ప్రమేయమూ లేదని స్పష్టం చేశారు. అటువంటి ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు.

> ఐదో కాంటూరు లోపల ఉన్న పలు చేపల చెరువులకు గండ్లు
>
> సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే అంటున్న అటవీ శాఖాధికారులు
>
> దాదాపు 18 వేల ఎకరాలకుపైగా అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా
>
> అధికారులు కొన్నిచెరువుల వద్దకే వెళ్లడంపై పలు అనుమానాలు
>
> రాజకీయ ప్రమేయం ఉందంటూ గ్రామాల్లో చర్చ
>
> బెదిరించి దారికి తెచ్చుకునే యత్నమంటూ ప్రచారం

జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

రాష్ట్ర ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని, విరివిగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన డిసిసి, డిఎల్‌ఆర్‌సి (బ్యాంకర్ల) సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజన్‌కు అనుగుణంగా బ్యాంకులు జిల్లా అభివృద్ధికి సహకరించాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు విరివిగా రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 1,08,330 సిసిఆర్‌సి కార్డుల జారీ లక్ష్యమవ్వగా, ఇప్పటివరకు 87,178 కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. రబీ సీజన్లో లక్ష్యాన్ని పూర్తి చేస్తారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.361 కోట్లు పంట రుణాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ సీజన్లో రూ.410 కోట్ల పంట రుణాలు మంజూరు లక్ష్యమవ్వగా ఇప్పటికే రూ.162 కోట్ల రుణాలు మంజూరు చేశామని, త్వరలో లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో రెండేసి గ్రామాలు చొప్పున నిర్వహిస్తామని, బ్యాంకర్లంతా తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. బ్యాంక్ కంట్రోలర్స్ ఈ విషయమై శ్రద్ధ వహించాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాల మంజూరు రూ.6,011 వేలు లక్ష్యం కాగా, 4,026 మాత్రమే మంజూరు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా పాల ఉత్పత్తుల్లో మూడో స్థానంలో ఉందని, రాష్ట్ర విజన్‌కు అనుగుణంగా లక్ష్యానికి మించి రుణాలను అందజేయాలని కోరారు. ఎస్‌హెచ్‌జిలకు రుణాల మంజూరు, ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ లక్ష్యంగా రుణాల మంజూరులో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. నాబార్డు ఎజిఎం ఆర్‌కె.హనుమ కుమారి మాట్లాడుతూ బ్యాంకర్ల సమావేశానికి కంట్రోలర్లు మాత్రమే హాజరు కావాలని ఆదేశించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌ఎం పి.సంగీత కుమారి మాట్లాడుతూ బ్యాంకర్లు కౌలుదారులకు రుణాలను అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఆర్థిక అంశాల అవగాహనపై సందేహాలు, సమాధానాలు, వయోవృద్ధులకు ఆర్థిక అక్షరాస్యత, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, ఆర్‌బిఐ ఎజిఎం ఆర్‌కె.హనుమ కుమారి, యుబిఐ ఆర్‌ఎం పి.సంగీతకుమారి, నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రానికి తలమానికంగా భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భీమవరం సుందరీకరణ పనులపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో ఆమె సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భీమవరం అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే ఏయే ప్రాంతాల్లో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలను రూపొందించామని, ఆర్థిక వనరులను సమకూర్చేందుకు పలువురు దాతలతో కూడా చర్చించామన్నారు. సంబంధిత డిజైన్లను కూడా ఆర్కిటెక్చర్ ద్వారా రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులను ప్రారంభించుకున్నామని, మరికొన్ని పనులు చేపట్టడానికి ఆర్థిక వనరులు సమకూర్చడానికి దాతల సహకారం అవసరమన్నారు. అమ్యూజ్మెంట్ పార్క్, లైవ్ డాల్ఫిన్స్ పార్క్, సైన్స్ పార్క్ తదితర పార్కుల నిర్మాణంతోపాటు, ఉన్న పార్కుల అభివృద్ధి, ఖాళీ ప్రదేశాల్లో, రోడ్డు కూడళ్లలో ఆకర్షణీయమైన కట్టడాలు, ఫౌంటెన్‌లు, లైటింగ్, ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఏర్పాటు, డివైడర్స్‌కు ఇరువైపులా అందమైన పెయింటింగ్స్, వెల్కమ్ ఆర్చిల ఏర్పాటుకు ఆలోచన ఉన్నట్లు వివరించారు. సమావేశంలో లయన్ ఇంటర్నేషనల్ కె.కృష్ణంరాజు, మున్సిపల్ ఇఇ పి.త్రినాధరావు, డిఇలు అప్పలరాజు, శ్రీనివాస్, రెహమాన్, ఎఇలు రవితేజ, శరత్ పాల్గొన్నారు.

నరసింహరాజుకు ఎంఎల్‌సి గోపీమూర్తి పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి



ఇటీవల మృతి చెందిన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన యుటిఎఫ్ సీనియర్ నేత ఇందుకూరి వెంకటపతిరాజు మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఆయన కుమారుడు నరసింహరాజును బుధవారం ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ వెంకటపతిరాజు సుదీర్ఘకాలం పాటు యుటిఎఫ్ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆయన వెంట యుటిఎఫ్ మాజీ నాయకులు దేవ సుధాకర్, ఈదా సంపత్ రావు, ప్రజా సంఘాల నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ ఉన్నారు.

చెస్‌లో ఎపి నిట్ మహిళా బృందానికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



అస్సాం రాష్ట్రంలోని సిల్చర్ ఎన్‌ఐటిలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకూ ఐదు రోజులపాటు జాతీయస్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ ఎన్‌ఐటి మహిళల ఫ్యాకల్టీ అండ్ స్టాఫ్ చదరంగం టోర్నమెంట్-2024 పోటీల్లో ఎపి నిట్ మహిళల ఫ్యాకల్టీ అండ్ స్టాఫ్ బృందం అద్భుత ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణరావు తెలిపారు. అస్సాం సిల్చర్ ఎన్‌ఐటి డైరెక్టర్ దిలీప్ కుమార్ బైద్య చేతుల మీదుగా బృంద సభ్యులు బహుమతిని అందుకున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యెగ్గిన దీపిక కుమారి (కెప్టెన్), దేవిన చైతన్య, చెక్కపల్లి కాశీఅన్నపూర్ణలను రమణరావుతోపాటు రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధస్సుకు పదును పెట్టే అద్భుత క్రీడ చదరంగమన్నారు. ఎవరైతే సరైన సమయంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తారో వారికే విజయం చేకూరుతుందన్నారు. ఇటువంటి అద్భుత క్రీడలో ప్రథమ స్థానాన్ని సాధించి, ఎపి నిట్ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయమని కొనియాడారు. లక్ష్యం మీద స్పష్టత, సాధించాలనే ప్రయత్నంలో అకుంఠిత దీక్ష ఉంటే ఏ క్రీడలోనైనా రాణించవచ్చని, తమ విద్యా సంస్థకు చెందిన మహిళల ఫ్యాకల్టీ అండ్ స్టాఫ్ బృందం నిరూపించిందని ప్రశంసించారు. విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని క్రీడా పతకాలు తీసుకొచ్చి సంస్థ పేరు ప్రఖ్యాతలను నిలబెట్టాలని సూచించారు.

ఉదయం ఎండ.. సాయంత్రం చినుకులు

వాతావరణం తీరుతో రైతుల్లో ఆందోళన



ఆచంటలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎండ వచ్చినా, మధ్యాహ్నం నుంచి వాతావరణం మబ్బులతో ఉండి చినుకులు పడ్డాయి. దీనికి చలిగాలులు తోడవడంతో జనం వణుకుతున్నారు.

ఆచంట: వాయుగుండం హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు చేతికొచ్చిన పంట ఎక్కడ చేజారిపోతుందో అని తల్లడిల్లుతున్నారు. వర్షం కురిస్తే ఒక్క గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే అధిక వడ్డీలకు అప్పు చేసి భారీగా పెట్టుబడులు పెట్టామని, ఈ తరుణంలో వర్షం కురిస్తే మిగిలేది కన్నీరే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 10,015 ఎకరాల్లో సార్వా సాగు చేయగా ఇప్పటికే 70 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. మరో 30 శాతం వరకూ కోతకొచ్చి ఉంది. ప్రస్తుతం మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెనుమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, కందరవల్లి, కరుగోరుమిల్లి గ్రామాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే వాతావరణ శాఖ వాయుగుండం హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే సార్వా సాగుకు భారీగా పెట్టుబడులు పెట్టి రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయామని వాపోతున్నారు. దీనికితోడు దాళ్వా సాగుకు సన్నద్ధం కావాలని వ్యవసాయాధికారులు చెప్పడంతో ఇప్పటికీ కొందరు రైతులు పలుచోట విత్తనాలు చల్లారు. ఈ సమయంలో వర్షం వస్తే మొలకెత్తే విత్తనాలు తేలిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాయుగుండం ముప్పు తప్పితే తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో రైతులు దిగాలు చెందుతున్నారు.

మత్స్య యూనివర్సిటీ ఒఎస్‌డిగా సుగుణ

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురంలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటి ఒఎస్‌డిగా డాక్టర్ టి.సుగుణ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ తాడిగడపలోని ఎపి ఫిషరీస్ యూనివర్సిటీ క్యాంప్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో సుధాకర్ నుంచి సుగుణ ఒఎస్‌డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె ఎపి ఫిషరీస్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్‌కు టెక్నికల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను ప్రాంతానికి చెందిన సుగుణ ఖమ్మం జిల్లా పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో సీనియర్ సైంటిస్ట్‌గా, నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్‌గా, ఉండి, కాకినాడ మత్స్య పరిశోధనా కేంద్రాల్లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్‌గా పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఒఎస్‌డిగా పని చేసిన సుధాకర్ కాకినాడలోని ఎపి ఫిషరీస్ మత్స్య పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్‌గా బదిలీపై వెళ్లారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలో ఇంటింటికి సిపిఎం మహాసభ ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అధిక ధరలు అరికట్టాలని, ప్రజలపై విద్యుత్ భారాలు ఉపసంహరించాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చూపాలని, టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించాలని అనేక ఆందోళన, పోరాటాలు సిపిఎం నిర్వహించిందన్నారు. జనవరి 3న వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని, 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాసు, పట్టణ నేతలు సిహెచ్.వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, ఎం.నాగేశ్వరరావు, కె.కోదండం పాల్గొన్నారు.



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

వారధి నిర్మాణానికి నిధులివ్వండి: పితాని

పెనుమంట్ర, ఆచంట: కోడేరు వద్ద తూర్పుగోదావరిని కలుపుతూ గోదావరిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి నితిన్‌గడ్కరీని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ కోరారు. ఢిల్లీలో బుధవారం గడ్కరీని పితాని కలిసి వారధి అవసరం వివరించారు. కోడేరు నుంచి గన్నవరం వరకూ వారధి నిర్మిస్తే లంక గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగకరమని, లంకల్లో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించొచ్చని పితాని తెలిపారు. గోదావరి వరదల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా వంతెన నిర్మాణం ద్వారా నివారించవచ్చునని తెలిపారు. దీనిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంఎల్‌ఎ పితాని చెప్పారు. పితాని వెంట కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కారీని కలిసిన ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

క్రొవ్విడిలో రేవ్ పార్టీ కలకలం!

జనసేన గ్రామాధ్యక్షుడు పుట్టినరోజు సందర్భంగా పార్టీ

రైస్‌మిల్లు ప్రాంగణంలో 12న ప్రత్యేకంగా ఏర్పాట్లు - నగ్న నృత్యాల వీడియోలు వెలుగులోకి

జనసేన నుంచి ఇంద్రకుమార్ సస్పెండ్ - కేసు నమోదు చేశాం: నిడమర్రు ఎస్ఐ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామంలో రేవ్ పార్టీ దృశ్యాలు బుధవారం కలకలం రేపాయి. క్రొవ్విడి గ్రామ జనసేన అధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 12వ తేదీన ప్రత్యేక పార్టీ ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులో 12వ తేదీ రాత్రి ఆ పార్టీ జరిగింది. ఈ పార్టీకి అమ్మాయిలను తీసుకొచ్చి రేవ్ పార్టీ తరహాలో వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. పార్టీలో మహిళలు నగ్నంగా డ్యాన్స్ చేస్తున్న దృశ్యాలు బుధవారం వైరల్ అయ్యాయి. రాజకీయ విబేధాల కారణంగా కొంతమంది ఈ వీడియోలను ఆలస్యంగా బయటపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో వాకమూడి ఇంద్రకుమార్‌ను జనసేన గ్రామ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు నిమ్మల దొరబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే నిందితులను మాత్రం అరెస్టు చేయకుండా జనసేన అధినాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. నిందితులను అరెస్టు చేస్తారో.. కాపాడతారో వేచిచూడాలి.

బొలిశెట్టిచే కారుణ్య నియామక పత్రాలందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంఎల్‌ఎ

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం జారీ చేసిన కారుణ్య నియామక పత్రాలను ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. తాడేపల్లిగూడెం సంజీవ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్ వద్ద స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ చనిపోయిన కోట మాణిక్యమ్మ కుమారుడు గంజి శ్రావణ్‌కు స్కూల్ అటెండర్‌గా, తాడేపల్లిగూడెం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తూ చనిపోయిన మంగళగిరి గంగమ్మ కుమారుడు మంగళగిరి ప్రసాద్‌కు పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా నియమిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అందజేశారు.

లక్ష్మణేశ్వరంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - నరసాపురం

మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో బుధవారం 104 ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌బి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.మాధురి ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎన్.సజీత, హెచ్‌వి కె.ధనలక్ష్మి, ఎఎన్ఎం జె.నిర్మల జ్యోతి, ఆశాలు బి.మణికుమారి, కెవి.రమణ, జి.సూర్యకుమారి పాల్గొన్నారు.

రోడ్ల పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో జరుగుతున్న రహదారి మరమ్మతు పనులను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ బుధవారం పరిశీలించారు. దాదాపు రూ.3 కోట్లతో నరసాపురం నుంచి కరింశెట్టిపాలెం వరకూ నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. రోడ్ల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, పనులు సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు పక్కన వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. ఆయా వ్యాపారులకు సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి జెఇ కేటి ప్రసన్నబాబు, వలవల నాని, వత్రిపోలు సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత

ఎలక్ట్రికల్ డిఇ వెంకటేశ్వరరావు

భీమవరంటౌన్:ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని, ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దామని భీమవరం ఎలక్ట్రికల్ డిఇ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం భీమవరం డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపుపై వాకర్స్‌తో అవగాహనా సదస్సు నిర్వహించారు. డిఇ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ వాడకాన్ని తగ్గించాలని, బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బులు వాడితే తద్వారా 60 శాతానికి పైగా విద్యుత్ ఆదా చేయొచ్చని తెలిపారు. ఎలక్ట్రికల్ ఎడి కె.రాంబాబు, జెఎఇ ఎన్.శ్రీనివాస్‌రాజు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కటికల పల్లరావు మాట్లాడారు. ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందన్నారు. స్కూల్ డైరెక్టర్ గంధం శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి రామకృష్ణంరాజు (బోస్), కొత్త శ్రీనివాస్, కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న రైతులు, వినియోగదారులు

ప్లాస్టిక్ వినియోగం వీడాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం భీమవరం రైతు బజార్లో శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రైతులు, వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, నమూనా గుడ్డ సంచుల ప్రదర్శన నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కళ్యాణ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. గుడ్డ, నార సంచులు వాడాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, వినియోగదారులు షేక్ బేగం, చవ్వా నాగలక్ష్మి, నార్సిమిల్లి మంగతాయారు మాట్లాడారు. అనంతరం ప్రచారం, ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

మొగల్తూరు:గ్రామ పంచాయతీల్లో వనరులను సద్వినియోగం చేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామాల సుస్థిరాభివృద్ధిపై నిర్వహించనున్న శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, ఎంపిహెచ్ఇఒ మూర్తి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, జగన్నాధపురం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మోడీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుభాకర్ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ పశు వైద్యాధికారి నీలిమ, పలువురు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

నరసాపురం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్థిక వనరులు, లక్ష్యాలను ఏ విధంగా అందుకోవాలన్న దానిపై మండల స్థాయి అధికారులు, సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, పెండింగ్ సమస్యలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల ఏర్పాటు తదితర విషయాలపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ లోకేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.సోని, ఎంపిడిఒ రామకృష్ణంరాజు, సూపరింటెండెంట్ విజయరాణి పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

నరసాపురం:నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో సుమారు 60 కిలోమీటర్ల మేర ఆర్అండ్ బి రహదారులకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు శాఖ డిఇ జివిఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికి 30 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఇవి కాకుండా రూ.3.34 కోట్లతో 19 పనులు చేపడుతున్నామన్నారు. రూ.28 కోట్లతో ముత్యాలపల్లి మొల్లపర్రు, సీతారామపురం, పేరుపాలెం మధ్య బిటి, సిసి రహదారుల పనులు చేపడుతున్నామన్నారు. పెనుమర్రి లక్ష్మీపతిలో ఆర్అండ్ బి మరమ్మతు పనులకు రూ.35 లక్షలు కేటాయించామన్నారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నట్లు డిఇ చెప్పారు.



పైపులైన్ నుండి వృథాగా పోతున్న శుద్ధి జలాలు

వృథాగా తాగునీరు..!

సమస్యను పరిష్కరిస్తాం

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహన్‌రావు

ప్రజాశక్తి - మొగల్తూరు

శుద్ధి జలాలు సరఫరా చేసే పైపులు మరమ్మతులకు గురవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. కెపిపాలెంలో సమగ్ర రక్షిత తాగునీటి పథకం నుంచి పైప్‌లైన్ ద్వారా మోడీ, ముత్యాలపల్లి, వారతిప్ప గ్రామాల ప్రజలకు ఈ పైప్‌లైన్ నుంచే శుద్ధిజాలాలు సరఫరా చేస్తారు. కొత్తకాయలతిప్ప - మోడీ గ్రామాల మధ్య కల్వర్టు సమీపంలో ఉన్న పైప్‌లైన్ మరమ్మతులకు గురవ్వడంతో శుద్ధి జాలాలు వృథాగా పోతున్నాయి. సమస్యను ప్రజాశక్తి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ డి.మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు.

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి

పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్

ప్రజాశక్తి - ఆచంట

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు త్వరితగతిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న మిల్లులకు తరలించుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్ అన్నారు. బుధవారం ఆచంట ఎఎంసి కార్యాలయం వద్ద ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం అధికంగా ఉంటే కట్ ఫార్ములా ద్వారా ధాన్యాన్ని రైతులు విక్రయించుకోవచ్చని తెలిపారు. మండలంలో సార్వాలో 10,015 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇప్పటివరకూ 7,550 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, 18,875 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడుతూ ఇప్పటివరకూ 14,750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండు రోజులు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఐదు లక్షల గోనె సంచులకు గాను ఇప్పటివరకూ 4 లక్షల 45 వేల గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న శివరాంప్రసాద్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. బుధవారం లక్ష్మణేశ్వరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, ఆన్‌లైన్, మ్యూటేషన్, పట్టాదారి పుస్తకాలు, సరిహద్దులు, సర్వే తదితర సమస్యలను ఈ సదస్సుల్లో విన్నవిస్తే అధికారులు పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజరాజేశ్వరి, సర్పంచి తిరుమాని వెంకట్రాజు, ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్ఒలు చిరంజీవి, భారతి, బాలాజీ పాల్గొన్నారు.



నరసాపురం :మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

ఆచంట : గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రెవెన్యూ సదస్సులు కీలకపాత్ర పోషిస్తాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. బుధవారం వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు రమేష్, సుబ్బారావు శ్రీనివాస్, చిట్టూరి శ్రీను పాల్గొన్నారు.


పెనుగొండ:రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ అనిత కుమారి రైతులకు సూచించారు. బుధవారం రామన్నపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గ్రామసభల నిర్వహణ

ఉండి : మండలంలో రెవెన్యూ సదస్సులు తూతూ మంత్రంగా నిర్వహించడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. బుధవారం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల స్థాయి అధికారులు నామమాత్రంగా పాల్గొని వెళ్లిపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రామంలో టామ్ టామ్ వేసిన సమయంలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్, మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ పాల్గొంటారని ప్రచారం చేసినప్పటికీ సదస్సులో సర్వేయర్ పాల్గొనలేదని, తహశీల్దార్ కొంతసేపు మాత్రమే పాల్గొని వెళ్లిపోవడంతో విఆర్ఒ, గ్రామ సర్వేయర్లతో సదస్సు నిర్వహించడం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంతైంది. దీంతో సదస్సులు నిర్వహించడం దేనికని గుసగుసలాడుకున్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో జరిగిన అవకతవకలపై కొంతమంది ఫిర్యాదు చేయగా తహశీల్దార్ కావడి నాగార్జున విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సులో 18 మంది అర్జీలు సమర్పించినట్లు విఆర్ఒ ఎస్.చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి యర్రా దుర్గారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు యర్రా వెంకట సుబ్రహ్మణ్యం, చెన్నకేశవ స్వామి ఆలయ ఛైర్మన్ యర్రా సుబ్బారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ దాసి రాజు సూచించారు. మండలంలోని కెపిపాలెం నార్త్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులందరూ కూడా తమ భూములకు సంబంధించి ఆన్‌లైన్ సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. తేడాలుంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుని సరి చేయించుకోవాలని ఆయన సూచించారు.

మండలంలోని కెపిపాలెంసౌత్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 62 వినతులు వచ్చాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. కెపిపాలెంనార్త్‌లో 37, కెపిపాలెంసౌత్‌లో 25 వినతులు వచ్చాయని ఆయన తెలిపారు.



పెనుగొండలో..



తణుకు : మాట్లాడుతున్న న్యాయవాది కామన మునిస్వామి

మైనార్టీల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మైనార్టీల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ఎంబి.భవాని తెలిపారు. బుధవారం మండల న్యాయ వ్యవస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సిఎం చర్చిలో మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది భవాని మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 18న మైనార్టీల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటామని, మైనార్టీలకు విద్య, సంస్కృతి, మతం, భాష ఆధారంగా వివక్ష నుంచి స్వేచ్ఛను పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. వీటిని అమలు చేయడానికి, మైనార్టీల హక్కుల పరిరక్షణకు నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ పనిచేస్తుందని ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ హక్కుల గురించి న్యాయవాదులు ఆర్.సుబ్బయ్య (సామ్యూల్), ఎండి.మునవర్, డి.రవికిరణ్, కె.సుబ్బరాజు, ఆర్.ప్రవీణ్ పాల్గొని ప్రసంగించారు.

తణుకు : భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ హక్కులు, బాధ్యతలు ఉన్నాయని, వాటికి అనుగుణంగా నడుచుకోవాలని సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి అన్నారు. బుధవారం ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి సత్యవతి ఆదేశాల మేరకు వేల్పూరు రోడ్డులోని మసీదు వద్ద తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలు ఉంటే ఉచిత న్యాయ సహాయం, సలహా కోసం మండల న్యాయ సేవల కమిటీ తణుకు వారిని సంప్రదించాలన్నారు. సదస్సులో న్యాయవాదులు ఎస్‌కె.మోతి, కోలా దుర్గాభవాని, టి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

డిసి ఛైర్మన్‌గా ఫణిబాబు రెండోసారి ఎన్నిక

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి తోట ఫణిబాబు ఉండి డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్‌గా రెండోసారి ఎన్నికయ్యారు. 2014లో టిడిపి ప్రభుత్వంలో అప్పటి ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు హయాంలో సీసలి సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికై ఉండి డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్‌గా మొదటి సారి ఎన్నికయ్యారు. 2019 వరకూ ఆ పదవిలో కొనసాగారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఆ ప్రభుత్వం సాగునీటి సంఘాలను రద్దు చేసింది. దీంతో కాలువల అభివృద్ధి పనులు జరగలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ఈ నెల 14న జరిగిన ఎన్నికల్లో సీసలి సాగునీటి సంఘం అధ్యక్షులుగా తోట ఫణిబాబు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫణిబాబు మరోసారి ఎన్నిక కావడంపట్ల పలు సాగునీటి సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్ర:గోదావరి వెస్ట్రన్ కెనాల్ పరిధిలోని సాగునీటి పంపిణీ సంఘం (డిసి) ఛైర్మన్ పదవుల ఏకగ్రీవం పట్ల మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పెనుమంట్ర డిసి ఛైర్మన్‌గా వెలగల బుల్లిరెడ్డి, మార్టేరు డిసి ఛైర్మన్‌గా జక్కంశెట్టి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎంపిక కావడం పట్ల సర్వత్రా హర్షం చేశారు.

రైల్వే గేట్‌ను తెరిచిన అధికారులు

ప్రజాశక్తి - ఉండి

ఉండి, ఆకివీడు రహదారిలోని రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం రైల్వేగేట్‌ను ఈ నెల 9న మూసివేసిన అధికారులు బుధవారం సాయంత్రం తెరిచారు. రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేసినప్పటికీ రైల్వేగేట్ వద్ద పనులు అసంపూర్ణంగా ఉండిపోయాయి. రైల్వే గేట్ వద్ద రహదారి వేయకపోవడంతో ప్రయాణ సమయంలో వాహనదారులు జాగ్రత్త వహించకపోతే ఇబ్బందులు పడతామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 రోజులు గేటు మూసివేసినా అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయలేకపోయారని పలువురు విమర్శిస్తున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం రెండో బ్యాచ్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ ఎన్ఎన్.ఉమా మహేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామ సుపరిపాలనకు గ్రామాభివృద్ధికి సుస్థిర అభివద్ధి లక్ష్యాలు బాగా దోహదపడతాయన్నారు. అలాగే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వయిజర్ పసుపులేటి దుర్గ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్ డిటి.మూర్తిబాబు, సిడిపిఒ సిహెచ్ ఇందిర, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో రామేశ్వరస్వామి రథం మరమ్మతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తారామేశ్వరం గ్రామంలోని రామేశ్వరస్వామి దేవస్థానంలో పురాతన రథాన్ని మూడు లక్షల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నట్లు ఆలయ ఇఒ తెలిపారు. బుధవారం 150 సంవత్సరాల క్రితం తయారైన స్వామి వారి రథం మరమ్మతు పనులను ఆచంట ఎంఎల్ఎ పితాని తనయుడు పితాని వెంకట్ ప్రారంభించారు.రథం మరమ్మతు నిమిత్తం సుమారు 3 లక్షలు రూపాయలు అందించిన స్థానిక ప్రముఖులు ద్వారంపూడి వీరెడ్డి (లండన్) కుటుంబ సభ్యులను వెంకట్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కర్రి లక్ష్మణరెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు కడలి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులుగా రాజశేఖర్, నాగశిరోమణి

ప్రజాశక్తి - భీమవరం






యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఇటీవల జరిగింది. ప్రతి మూడేళ్లకోసారి యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతూ ఉంటుంది. దీనిలో భాగంగా ఇటీవల భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా మహాసభలో యుటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షునిగా కె.రాజశేఖర్, మహిళా సహాధ్యక్షురాలిగా సిహెచ్ నాగ శిరోమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అగ్నిమాపక కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఫైర్ అధికారి బి.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలో పలు రికార్డులు, డ్యూటీ రికార్డులు ఆయన పరిశీలించారు. స్టేషన్ పరిసరాల అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ అధికారి భాస్కర్‌రామ్, రైటర్ భాను పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- యలమంచిలి

మండలంలోని చించినాడ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ యుటిఎఫ్ మాజీ నేత ఈదా సంపతరావు సౌజన్యంతో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో రిటైర్ టీచర్ సంపతరావు ఏటా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతికుమార్, డోనర్ ఈదా సంపత రావు, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సరిపల్లి జయప్రభ, పొత్తూరి నరసింహరాజు, యాండ్ర సత్యనారాయణ, సిఐటియు నాయకులు దేవ సుధాకర్, కెవిపిఎస్ నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ పాల్గొన్నారు.



యలమంచిలి : విద్యార్థులకు స్టడీ మెటిరియల్ అందజేసిన యుటిఎఫ్ నేతలు

పాలకొల్లు రూరల్:దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడే విధంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన బండి రాధాకృష్ణ సౌజన్యంతో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్, పద్మశ్రీదేవి, రాజేశ్వరి, పద్మావతి, హెప్సీ రాణి పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని కొప్పర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు పోలిశెట్టి సీతారామయ్య (ఎస్ఆర్ పోలిశెట్టి) జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్ బుధవారం అందజేశారు. ఎస్ఆర్ పోలిశెట్టి కుమారులు వెంకట నరసింహారావు, అయ్యప్పనాయుడు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పోలిశెట్టి రమేష్, చినమిల్లి వీరబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

20న ఎస్‌కెఎస్‌డిలో పలు పోటీలు

ప్రజాశక్తి - తణుకు

ఎస్‌కెఎస్‌డి మహిళా యుజి, పీజీ (అటానమస్) కళాశాలలో ఈనెల 20న ఉదయం పది గంటలకు గణితశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, కంప్యూటర్స్, గణాంకశాస్త్రం విభాగాల వారు జాతీయ స్థాయి క్విజ్, పిపిటి, ఫన్‌స్టాట్, కోడింగ్, స్పెక్ట్రోమీటర్ ఎక్స్‌పెరిమెంట్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను 9848187600 నంబరుకు ఫోన్ చేసిపేరు నమోదు చేసుకోవాలని కోరారు.

21న ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఐక్య క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు కాకిలేటి ఆనంద్ తెలిపారు. బుధవారం ట్యాక్సీ స్టాండ్ వద్ద 18వ వార్షికోత్సవం సంబరాలకు సంబంధించిన కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. బుధవారం జనసేన కార్యాలయంలో విప్, ఎంఎల్ఎ నాయకర్ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో శ్యాంకుమార్, శ్రీరామ్, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.



శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

శ్మశాన వాటిక పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

కెపిపాలెంనార్త్‌లోని శ్మశానవాటికను ఆర్‌డిఒ దాసి రాజు బుధవారం పరిశీలించారు. శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని ఫిర్యాదుల మేరకు స్పందించిన ఆర్‌డిఒ శ్మశానవాటికను పరిశీలించారు. వెంటనే సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజ్‌కిషోర్, ఆర్ఐ ముచ్చర్ల నిరంజన్, సర్పంచులు కడలి సోంబాబు, అందే వెంకటలక్ష్మి, దొరబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించామని, ఒకరిని అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, సిబ్బందితో కలిసి గణపవరం మండలం వరదరాజపురం గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుండి 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

క్లబ్‌పై పోలీసుల దాడి

19 మంది అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండలం సీతారామపురంలో క్లబ్‌పై బుధవారం సాయంత్రం మొగల్తూరు పోలీసులు మెరుపు దాడి చేశారు. దీనికి సంబంధించి నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పక్కా సమాచారం ప్రకారం క్లబ్‌పై దాడి చేశామని, ఈ దాడిలో 19 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.21,280 నగదు, 20 కాయిన్స్, రెండు పేక కట్టలు, ఒక టేబుల్, నాలుగు కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

నాటు సారా, అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు అన్నారు. బుధవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న కడలి వెంకటేశ్వరరావును అరెస్టు చేసి అతని నుండి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఖాసిం, రైటర్ ప్రసాద్ పాల్గొన్నారు.